కథ

# సేవిక

దేవసేన

సౌందర్యం'- పేరుకు తగ్గరూపం. పూవుకుతావి అబ్బినట్టు, సిరితనం ఆమె అందాన్ని, ద్విగిణీకృతం చేసింది. శ్రీమంతుల ఇంటి ముద్దుబిడ్డ. అవటాన, ఆమె ఆడింది ఆట- పాడిందే పాట అందగత్తెననే. అహంకారంతో, పెళ్ళికొడుకులు ఎంతటివారయినా సరే.... అందంగా లేరని, తీసి పారేసింది. తనకి కాబోయే భర్త, విద్యాహీనుడైనా- ధనహీనుడైనా పరవాలేదు గానీ, తన అందానికి తగ్గ అందగాడై ఉండాలి, అని పట్టుబట్టింది. ఆమె కోరిక ప్రకారమే, అపరమన్మధుడైన యువకుడిని సౌందర్యకి భర్తగా ఎంచాడు తండ్రి. అతని అందానికి తగ్గ పేరుకాదని, గోవిందు పేరుని మన్మధ అని మార్చింది సౌందర్య

ఆ అందమైన జంట అన్యోన్యదాంపత్యానికి, ప్రతిఫలంగా అందమైన పాప పుట్టింది. ఆ బంగారు బొమ్మకు అపరంజి అని పేరు పెట్టింది సౌందర్య. పాప మూడో పుట్టిన రోజు. అత్యంత వైభవముగా.... బాలబాలికల ఆటపాటలతోనూ పెద్దల పలకరింపులతోను చలోక్తులతోనూ, సరదాగానూ సందడిగానూ జరిగింది.

ఆ రోజు అర్ధరాత్రి-ఉన్నట్టుండి, పాప వివరీతంగా ఏడవసాగింది. ఎన్ని విధాల బుజ్జగించినా, ఏడుపు ఆపలేదు. పనివాళ్ళు రకరకాల దిష్టిలు తీసారు. కానీ లాభంలేకపోయింది. పాప పరిస్థితి చూసిన సౌందర్యకు, దిక్కు తోచలేదు. పాపను తీసుకుని హాస్పటల్‌కు పరిగెత్తింది.

డాక్టర్లు పాపకు అనేక పరీక్షలు చేసారు. కానీ కారణం తెలియలేదు. ఏడ్చిఏడ్చి, పాప గొంతు రాసుకుపోయింది. కడుపు ఉబ్బిపోయింది. డాక్టర్లు పరీక్షలు జరువుతుండగానే, పాప ఏడుపు శాశ్వతంగా ఆపేసింది. సౌందర్య రోదననూ, ఎవరూ ఆపలేకపోయారు. కారణం తెలుసుకోలేక పోయినందుకు, బాధపడుతూ ఆ పాపబాడీని తమకిస్తే, కొన్ని పరీక్షలు జరిపి ఆ పాప చావుకి కారణాలు తెలుసుకోగలుగుతామని, అడిగారు డాక్టర్లు. తన పాపని ముక్కలు ముక్కలుగా కోయడానికి సుతరామూ ఇష్టపడలేదు సౌందర్య.

వృధాగా మట్టిలో కలిసిపోయే కళ్ళను, దానం చేస్తే ఇద్దరు అంధులకు, చూపు వచ్చి ఈ లోకం చూడగలుగుతారు. ఆ పుణ్యం నీదే అవుతుంది. నీ పాప కళ్లను, పొందిన వారి కళ్ళలో, నీ పాపని చూసుకోవచ్చు అని ఆత్మీయులు, నచ్చ చెప్పారు. పాప కళ్లని తీస్తే, ఆ స్థానంలో గుంటలు పడతాయని-ఏ అంగలోపమూ లేకుండా పుట్టిన, తన పాపని అలాగే ఖననం, చెయ్యాలనీ పట్టుపట్టింది సౌందర్య.

పాప మరణించి ఆరునెలలయ్యింది.

ఇంట్లో ఉండే సభ్యులే తక్కువ, అందునా ముద్దులొలికే పాప వియోగం తరువాత ఆ ఇంట్లో స్మశానకళ ఆవహించింది. పదిరోజులుగా సౌందర్య భర్త మన్మధ నలతగా ఉంటున్నాడు. పాప మరణంతో ధైర్యం సడలిన సౌందర్య, భర్తని హాస్పటలుకు తీసుకువెళ్ళింది. వారం రోజుల పరీక్షలనంతరం, డాక్టరు మన్మధకు కిడ్నీలు సరిగా పని చేయడం లేదనీ, కనీసం ఒక కిడ్నీ పనిచేసినా, ఆరోగ్యం కాపాడుకోవచ్చని-ఎవరైనా ఒక కిడ్నీ డొనేటు చేస్తే, అతనికి ఆపరేషన్ చేయవచ్చనీ చెప్పారు.

డాక్టర్‌మాటవింటూనే హతాశురాలయ్యింది సౌందర్య. 'డాక్టరుగారూ! బతికున్నవాళ్ళే కదా కిడ్నీ ఇవ్వాలి. అలా ఎవరైనా ఇస్తారా...!' అమాయకంగా అడిగింది.

'మీరు చదువుకున్నవారు కదా... కిడ్నీ గురించీ, కిడ్నీ దానాల గురించి మీరెప్పుడూ వినలేదా....! ఏ శకంలో ఉన్నావు! అన్నట్టు చూశాడు డాక్టరు.

అది కాదండీ... కిడ్నీ శరీరంలో అతి ముఖ్యమైన భాగం కదా.... మరి బతికి ఉండగానే వాటిని ఎవరు దానం చేస్తారు? సందేహంగా అడిగింది ఆమె.

'అదా మీ సందేహం! దానికీ ఉంటారండీ పుణ్యాత్ములు. కొంతమంది డబ్బు కోసం చేస్తారు. మరికొంతమంది, జీవితం అంటే కేరేదేమ్‌గా ఉంటారు. అలాంటివారు., కిడ్నీలు డొనేట్ చేస్తారు.

ఏదీ ఏమైనా ఆ కిడ్నీ డోనర్ బ్లడ్ గ్రూప్, పేషెంట్ బ్లడ్ గ్రూపూ కలవాలి. అది ముఖ్యం అన్నాడు డాక్టర్.

'అలాగయితే, ఎంత డబ్బు ఖర్చయినా సరే పరవాలేదు. మీరు, మీ ప్రయత్నం చేయండి.' అంది. సౌందర్య మెదడులో, పాప మరణం నాటి దృశ్యం, కదిలింది, అందరూ ఎంతగా నచ్చ చెప్పినా,పాప కళ్ళను తాను దానం చెయ్య లేదు. అవివృధాగామట్టిలో కలిసిపోయాయి. పాపబాడీనితమకిస్తే,పరీక్షలు జరిపిపాపమరణానికి కారణం తెలుసుకుంటామని-భవిష్యత్తులో ఇలాంటి కేసువస్తే, వైద్యం చేయడానికి ఉప యోగ పడుతుందనీ, ఎంతగానో ప్రాధేయపడ్డారు డాక్టర్లు. తను ససేమిరా అంది.

ఇప్పుడు తన భర్తకు అత్యవసరంగా కిడ్నీ కావలసి వచ్చింది. తాము బతికి ఉండగానే కిడ్నీలు దానం చేసే వారిని చూస్తుంటే తనెంత మూర్ఖురాలో తెలుస్తున్నది సిగ్గుతో తల దించుకుంది.

నాల్గురోజుల తరవాత కిడ్నీ డోనర్ దొరికేరని ఫోన్ చేసి చెప్పాడు డాక్టర్.

ఆ పుణ్యాత్ముడిని చూడాలని, ఆత్రంగా వెంటనే వచ్చింది సౌందర్య. డాక్టర్ పరిచయం చేసిన వ్యక్తిని, చూడగానే అతన్ని ఎక్కడో చూసినట్టు అనిపించి ఆలోచించసాగింది.

'నమస్తే! గుర్తున్నానా మేడమ్' అంటూ అతనే పలకరించాడు 'నా పేరు యోగి ఒకసారి మీ ఆఫీసుకి వచ్చాను. బిజినెస్ పని మీద కాదులెండి. బెగ్గింగ్! బెగ్గింగ్ పని మీద' అని పెదవి విరుస్తూ నవ్వాడు.

అతను బెగ్గింగ్ అని చెప్పగానే ఆ సంఘటన గుర్తుకు వచ్చింది. అతని కూతురికి గుండె ఆపరేషన్‌కి హాస్పటల్ ఖర్చుకి పాతికవేలు తగ్గాయనీ- కనీసం ఐదారువేలు సహాయం చేయమని ప్రాధేయపడ్డాడు.

అప్పుడు తను ధనహంకారంతో నిర్లక్ష్యంగా నవ్వి 'ఇలా రోగాల పేరు చెప్పి సహాయం చేయమని చాలా మంది వస్తుంటారు. ఎవరిని నమ్మాలి? నేను ఇలాంటి వారిని ప్రోత్సహించను. వెళ్ళు' అంది. 'ఇప్పుడెలా వుంది మీ పాప?' కడుపుశోకం అంటే ఏమిటో తెలిసినదవటాన బాధగా అడిగింది.

'ఈ అసమర్థుడు ఆపరేషన్ చేయించలేక పోయాడు కదా.. ఇంకెలా వుంటుంది పాప!' నిర్లిప్తంగా నవ్వాడు.

'అయ్యో! పాపం!' జాలితో ఆమె గొంతు వణికింది.

'పాపం ఎందుకులెండి! పోయినోళ్ళు అందరూ మంచోళ్ళు అంటారు కదా. నా దృష్టిలో వాళ్ళు అదృష్టవంతులు గూడా. ఈ కరువు కాటకాలతో దినదినమూ చచ్చి బతికే కన్నా ఒకేసారి చావడం మేలు. మా పాప మరణాన్ని భరించలేని నా భార్య, ఆత్మహత్య చేసుకుంది. వాళ్లిద్దర్ని కోల్పోయినా, నేను మాత్రం బతికే ఉన్నాను. మరణించడానికి కూడా, నేను అసహాయుడినే...' భారంగా నిట్టూర్పు వదిలాడు.

ఆమె హృదయం బరువెక్కింది. ఆ రోజు తను ఆర్ధికసాయం చేసి ఉంటే అతని బిడ్డ బతికి ఉండేది భార్యా బిడ్డల్ని పోగొట్టుకునే స్థితి అతనికి వచ్చి ఉండేది కాదు. ఆ పాప మరణం నా పాలిట శాపం అయ్యింది. డబ్బులేక అతను పాపను పోగొట్టుకున్నాడు. నేను డబ్బుండీ పాపను దక్కించుకోలేకపోయాను. ఇప్పుడు నా భర్త ప్రాణాలు మరొకరి దానధర్మాల మీద ఆధారపడి ఉన్నాయి. తప్పు చేసినదానిలా తలవంచుకుంది.

ఇతను కఠిన దారిద్ర్యాన్ని, అనుభవిస్తున్నట్టున్నాడు. ఆనాడు పాతికవేలు ఇవ్వని నేను, ఇప్పుడు అతను అడిగితే, పాతిక లక్షలయినా ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాను. ఈ రూపేణా నా పాపాన్ని, ప్రక్షాళన చేసుకుంటాను. అనుకుని 'డాక్టర్ ఇతనికి డబ్బెంత ఇవ్వాలి? ఎప్పుడివ్వాలి? కనుక్కోండి' అంది.

'డబ్బా! ఎవరికి? నేను కిడ్నీని డబ్బుకు ఇస్తున్నానని ఎవరు చెప్పారు? అన్నాడు విసురుగా యోగి,

'డబ్బు వద్దా...! ఆశ్చర్యంగా అడిగింది.

నేను కిడ్నీ డొనేటు చేస్తే, మీ భర్త ఆరోగ్యం కుదుటపడుతుంది. దానివల్ల మీ ఇరువురూ సంతోషంగా ఉంటారు. తోటి మానవుడు కష్టంలో ఉన్నప్పుడు, నీకు చేతనయినంత, సహాయం చేయడం, నా అభిమతం అంతే తప్ప, నా అవయవాలను అమ్ముకుని, బతకాలని నేను కోరుకోవడం లేదు. అన్నాడు యోగి.

మీరు ఒక కిడ్నీ డొనేటు చేస్తున్నారు. మరో కిడ్నీ ఆరోగ్యంగా ఉంటే తప్ప మీరు జీవించడం కష్టం కదా! ఆ రిస్కులేకుండా మీరు శ్రమ పడకుండా సుఖంగా బతకగలిగేందుకు డబ్బిస్తాను.' అంది చాలా వినయంగా.

'ఆ రెండో కిడ్నీ కూడా డొనేటు చేయడానికి సిద్ధంగా ఉన్నాను. నాకు బతుకు మీద ఆశలేదు. నేను చస్తే ఏడ్చే వాళ్ళు లేరు. నేను బతికి బతికించవలసిన వారెవరూ లేరు. ఉన్నన్ని నాళ్ళు ఉంటాను. ఆయుషు మూడితే చస్తాను. దానికెందుకింత బాధ! అంతటి బరువైన విషయాన్ని గూడా చాలా తేలికగా చెపుతూ 'డాక్టర్ మీరు చెప్పండి, నేనెప్పుడు రావాలి?' అని తెలుసుకుని వెళ్ళిపోయాడు యోగి.

అతని మాటలు ఆమె చెంపచెళ్ళు మనిపించాయి. ఆమెకు జ్ఞానోదయం అయ్యింది. మట్టిలో కలిసిపోయే కళ్ళను దానం చేయని ఆమెకు- ఆరోగ్యానికి అత్యంత ముఖ్యమైన కిడ్నీని అవలీలగా డొనేటు చేస్తున్న యోగిని చూసి దేవుడెక్కడో లేడనిపించింది. ఆ ఆదర్శపురుషుడు హిమాలయాలంత ఎత్తుగా కనిపించాడు. ఆమె మనసు మారింది. మనిషి మారింది. ఇన్నాళ్ళు తను జీవించిన జీవితం వ్యర్థం అనుకుంది. ఇకనైనా సమాజసేవ చేసి మానవత్వం ఉన్న మనిషిగా బతకడానికి నిశ్చయించుకుంది.

డాక్టర్లతో సంప్రదించి ఐ బ్యాంకు, బ్లడ్‌బ్యాంకులతో బాటు, అవయవాల బ్యాంకును గూడా ప్రారంభించింది. వాటిలో పని చేయడానికి డాక్టర్ల సహకారంతో స్టాఫ్‌ని కూడా నియమించింది. డొనేటు చేసిన వారికి పెద్దమొత్తంలో పారితోషికం ఇచ్చి, సంతోషపరచడానికి పెద్దమొత్తాన్ని కేటాయించి, దానికి ట్రస్ట్‌ని ఏర్పాటు చేసింది. దీన్నంతటినీ ఆర్గనైజ్ చేయమని, యోగిని ప్రాధేయపడింది.

తను కూడా, ఆడంబరాలు లేని జీవితాన్ని అలవరుచుకుంది. అందం కోసం పరితపించే సౌందర్య, తన భర్త పేరునే మార్చిన సౌందర్య, ఇప్పుడు తన పేరును సేవికగా మార్చుకుంది.

ఎవరికి, ఎప్పుడు ఎక్కడ, ఎలాంటి సహాయము కావలసి వచ్చినా, తన బృందంతో వెళ్ళి, వారికి అన్ని రకాల సహాయం చేస్తుంది. ఎప్పుడూ తనకి సపర్యలు చేయించుకోవడమే గానీ- తను చేయని సౌందర్య ఇప్పుడు సకల జనాలకీ- సర్వవేళలా అందుబాటులో ఉంటూ సేవలు చేస్తున్నది. ఇప్పుడు ప్రజల దృష్టిలో ఆమె ఆపద్బాంధవి.